# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు : సీఎం కెసిఆర్

హైదరాబాద్, మే 3:నేడు రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) పర్వదినం సందర్భంగా తెలంగాణ సీఎం కేసీఆర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో ముస్లిం మతపెద్దలు రంజాన్ మంగళవారం జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కేసీఆర్ స్పందిస్తూ, రంజాన్ ఒక పవిత్రమైన పండుగ అని, మానవ సేవ చేయాలన్న సందేశాన్ని మానవాళికి అందించే పండుగ అని తెలిపారు. రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాసం క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అభిలషించారు.కాగా, ముస్లింల సర్వతోముఖాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని కేసీఆర్ తెలిపారు. షాదీ ముబారక్ ద్వారా పేద ముస్లిం కుటుంబాల్లోని ఆడపిల్లలకు పెళ్లి ఖర్చు కోసం రూ.1,00,116 అందజేస్తున్నామని చెప్పారు. మైనారిటీ యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ముస్లిం విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు వీలుగా ప్రత్యేక ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. లౌకిక వాదం, మత సామరస్యం పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం కేసీఆర్ ఉద్ఘాటించారు.


హైదరాబాద్ | బుధవారం 4-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 222 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని అధికారికంగా ప్రకటించనున్న పుతిన్

వాషింగ్టన్, మే 3: ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ ఆక్రమణను అధికారికంగా ప్రకటించనున్నారు. మే 9వ తేదీలోగా ఉక్రెయిన్‌పై అధికారికంగా పుతిన్ యుద్ధం ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వెల్లడించింది. ఈ చర్యలో భాగంగా రష్యా తన పూర్తి సైన్యాన్ని ఉక్రెయిన్ భూభాగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది. మే 9వ తేదీన విక్టరీ డేను రష్యా జరుపుకుంటోంది. 1945లో ఆ రోజున నాజీలను రష్యా ఓడించింది. ఆ రోజున ఉక్రెయిన్‌లో సాధించిన సైనిక చర్య ఫలితాలను పుతిన్ వెల్లడించే అవకాశాలు కూడా ఉన్నాయి. ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్ పేరుతో ఫిబ్రవరి 24వ తేదీన రష్యా దాడికి దిగిన విషయం తెలిసిందే. కానీ ఇప్పటి వరకు ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నట్లు కానీ, ఆక్రమణకు వెళ్లినట్లు కానీ పుతిన్ అధికారికంగా చెప్పలేదు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ యూదుడు కావడం వల్ల.. ఆ దేశంపై డీనాజిఫికేషన్‌లో భాగంగా దాడి చేపట్టినట్లు కూడా పుతిన్ వెల్లడించిన విషయం తెలిసిందే. మే 9వ తేదీన పుతిన్ చేసే ప్రకటనతో ఆ దేశం తన రిజర్వ్ దళాలను యుద్ధ రంగంలోకి దించే అవకాశాలు ఉన్నాయి. అయితే గత రెండు నెలలుగా సాగుతున్న వార్‌లో ఇప్పటి వరకు పది వేల మంది రష్యా సైనికులు చనిపోయి ఉంటారని పశ్చిమ, ఉక్రెయిన్ దేశ అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రజల చేతిలో అధికారం ఉంటే అంతా సర్దుకుంటుంది గులాంనబీ ఆజాద్

హైదరాబాద్, మే 3:ప్రజల చేతిలో అధికారం పెడితే అంతా సర్దుకుంటుందని అన్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గులాంనబీ ఆజాద్. జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై పలు కీలకమైన వ్యాఖ్యలు చేశారాయన. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ మసీదులో నమాజ్ చేసిన తరువాత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మీడియాతో మాట్లాడారు. కాశ్మీర్ లో ఎన్నికలు .. జరిగి అధికారం ప్రజల చేతుల్లో ఉంటే అప్పుడు అంతా సవ్యంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను. దేశం కోవిడ్–19 నుండి కొంత ఉపశమనం పొందడం ఆనందదాయకమైన విషయం. కరోనా వల్ల ఎంతో మంది ప్రజలు రోడ్డున పడ్డారు. ఇప్పుడైన ప్రజల్లో విద్వేషాలు తొలగిపోవాలన్నారు. పీడీపీతో నాయకురాలు మెహబూబా ముఫ్తీ నేతృత్వంలో బీజేపీ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే 2018 జూన్ లో ప్రభుత్వం నుంచి బీజేపీ వైదొలగింది. అప్పటి నుంచి అక్కడ రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. 2019 ఆగస్టులో రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంది. ఈ రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉన్నప్పటికీ శాసన సభను కలిగి ఉంది. చాలా కాలంగా రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయని అధికారులు పదేపదే హామీ ఇచ్చారు. అయినా ఇప్పటి వరకు అక్కడ ఎన్నికలు జరగలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ తన తుది నివేదికను కొద్ది రోజుల్లో సమర్పించబోతోందని ఇటీవలి నివేదికలు వచ్చాయి.

## 'ఆటా' 17వ మహాసభలు.. ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

హైదరాబాద్, మే 3: టీఆర్ఎస్ ఎన్నారై కో–ఆర్డినేటర్ మహేష్ బిగాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. వాషింగ్టన్ డీసీలో జూలై 1 నుంచి 3 వరకు జరిగే ఆటా 17వ మహాసభలకు రావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆటా ప్రతినిధులు మాట్లాడుతూ.. అమెరికా నలుమూలల నుంచి దాదాపు 15,000 మంది మహాసభలో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే ఈ సారి తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ని ఏర్పాటు చేయనున్నట్లు.. అందులో మన ఊరు –మన బడి, బతుకమ్మ, తెలంగాణ టూరిజం, వివిధ రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వారు ఎమ్మెల్సీ కవితకు వివరించారు.భవిష్యత్ తరాలకు మన బతుకమ్మ విశిష్టత గురించి తెలిపేందుకు బతుకమ్మ పై ఇంగ్లీష్‌లో పుస్తకాన్ని ముద్రిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటా అధ్యక్షుడు భువనేశ్ భుజాల, శరత్ వేముల, జయంత్ చల్ల, వేణు సంకినేని తదితరులు ఉన్నారు.

## అసత్యాలు ప్రచారం చేస్తున్న బండి సంజయ్‌ను ఏమనాలి : ఎర్రబెల్లి

హైదరాబాద్, మే 3:మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ పై విమర్శలు కురిపించారు. బండి సంజయ్ అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, వాస్తవాలు మాట్లాడడం నేర్చుకోవాలని దయాకర్ రావు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, పాదయాత్ర చేస్తూ ప్రజలకు బండి సంజయ్ ఎందుకు అబద్ధాలు చెబుతున్నారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వమే చెబుతోందని ఆయన అన్నారు.

కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం ఎలా కొనసాగుతుందో, తెలంగాణలో ఎలా కొనసాగుతుందో చర్చించేందుకు తమ వద్దకు రావాలని బండి సంజయ్‌కు సవాలు విసిరారు. ఉపాధి హామీ నిధులు మూడు నెలల నుంచి ఇవ్వట్లేదని అంటున్నారని, లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వమే నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తుందని అన్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్న బండి సంజయ్‌ను ఏమనాలని ఆయన నిలదీశారు.

### చరిత్రలో నేటినిజం




(మే 4 సంత్ కబీరుదాసు జయంతి..) –రాధశ్రీ



సెల్: 9494481210

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : మంత్రి తలసాని

హైదరాబాద్, మే 3: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం రంజాన్ సందర్భంగా సనత్ నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో మంత్రి పాల్గొన్నారు. అదేవిధంగా రాంగోపాల్ పేట డివిజన్ లోని నల్లగుట్టలో మసీదులో ప్రార్థనలు చేసిన అనంతరం మంత్రి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు నెల రోజులు ఎంతో నిష్ఠతో ఉపవాసం పాటిస్తారన్నారు. వారు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఎప్పటి నుండో వస్తుందని చెప్పారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా దుస్తులను పంపిణీ చేయడమే కాకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనేది తమ ప్రభుత్వం ఆలోచన అని మంత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు.



## ఈ కంపెనీ ఉద్యోగులకు అపరిమిత సెలవులు!

న్యూఢిల్లీ, మే 3: ఓ న్యూజిలాండ్ కంపెనీ తమ ఉద్యోగులకు అపరిమిత సెలవలను ఆఫర్ చేసింది. హై ట్రస్ట్ మోడల్‌గా చెబుతున్న కంపెనీ తమ ఉద్యోగులకు వీలైనన్ని సెలవలు తీసుకునే వెసులుబాటు కల్పించింది. యాక్షన్‌స్టెప్ అనే ఈ కంపెనీ ఉద్యోగులకు ఏడాదిలో నెలరోజులు సెలవు తీసుకోవచ్చని వెల్లడించింది. సిబ్బందిని సంతోషంగా ఉంచే ఉద్దేశంతో అక్‌ల్యాండ్ కంపెనీ ఉద్యోగులకు భారీ సెలవలను అనుమతించింది.లింక్డిన్, నెట్‌ఫ్లిక్స్ సైతం ఈ మోడల్‌ను ప్రయోగ పద్ధతిలో అనుసరించాయి. కొన్నేండ్ల కిందట మరో న్యూజిలాండ్ కంపెనీ రాకెట్‌వర్క్స్ తమ ఉద్యోగులకు అపరిమిత వార్షిక, సిక్ లీవులను ఆఫర్ చేసింది. వారానికి నాలుగు రోజుల పనిదినాలపై కసరత్తు చేయాలని ప్రధాని జకింద అర్డెర్న్ సూచన మేరకు ఉద్యోగులకు పనిలో వెసులుబాటు దిశగా కంపెనీలు దృష్టిసారిం చాయి. ఇక వారానికి నాలుగు పనిదినాల కాన్సెప్ట్‌కు అనుగుణంగా యూనిలివర్ న్యూజిలాండ్ గత ఏడాది తమ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది .మహమ్మారి సమయంలో లక్షలాది ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేస్తున్న సమయంలో వారానికి నాలుగు పనిదినాల కాన్సెప్ట్‌కు మద్దతు లభిం చింది. ఉత్పత్తిని పెంచేందుకు పని గంటల నుంచి సామర్ధ్యం పెంపు దిశగా ఈ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయని యూనిలి వర్ న్యూజిలాండ్ తెలిపింది. ఉద్యోగులు తక్కువ పనిచేసినా వారికి పూర్తి వేతనం చెల్లించాలని నిర్ణయించామని కంపెనీ ప్రకటించింది.

## వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

కరీంనగర్ , మే 3: వడదెబ్బతో ఉపాధి కూలి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని దూలం చెరువులో ఏప్రిల్ 25న ఉపాధి పనులు నిర్వహిస్తుండగా అట్టికేటి రామక్క (59) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో తోటి కూలీలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఈ విషయంపై గ్రామ ఉపసర్పంచ్ ఆకుల చంద్రశేఖర్, గ్రామ ప్రజలు మాట్లాడుతూ? ఉపాధిహామీ నిబంధనల ప్రకారం వేసవిలో సరైన ఏర్పాట్లు చేయడం లేదని, ఉపాధి హామీ అధికారుల నిర్లక్ష్యం వల్లే రామక్క మృతి చెందారని ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని, ఉప సర్పంచ్, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## డెన్మార్క్‌లోని కోపెన్‌హెగన్ చేరుకున్న ప్రధాని మోడీ

కోపెన్‌హెగన్, మే 3:: ప్రధాని నరేంద్ర మోడీ యూరప్ పర్యటనలో ఉన్నారు. కొద్దిసేపటి క్రితమే ప్రధాని మోడీ జర్మనీ నుంచి డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగన్ చేరుకున్నారు. విమానాశ్రయంలో డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడ్రిక్సన్ ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలికారు. అనంతరం కోపెన్‌హెగన్‌లో ఉన్న ఆ దేశ ప్రధాని మెట్టి ఫ్రెడ్రిక్సన్ నివాసంలో జరిగిన చర్చల్లో మోడీ పాల్గొన్నారు. ఫ్రెడ్రిక్సన్ నివాసంలో ఉన్న పచ్చిక లాన్‌లో ఇద్దరూ తిరుగుతూ వివిధ అంశాలపై ముచ్చటించుకున్నారు. చాలా సహజసిద్ధమైన ప్రకృతి మధ్య నేతలిద్దరూ కీలక అంశాలను చర్చించుకున్నారు.

## గోదావరిలో ఇద్దరు యువతుల గల్లంతు

అమరావతి, మే 3:గోదావరిలో ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు గల్లంతయ్యారు. ఇది గమనించిన స్థానికులు ఒకరిని రక్షించగా.. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. గల్లంతైనవారు రాజ్యలక్ష్మి (22), శ్రీదేవి (23)గా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్నీ వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా మహాత్మ బసవేశ్వరుని జయంతి వేడుకలు



న్యూఢిల్లీ : సామాజిక వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది, వీరశైవ మత స్థాపకుడు మహాత్మ బసవేశ్వరుని 889వ జయంతి వేడుకలు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ జయంతి వేడుకల్లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మహాత్మ బసవేశ్వరుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా డాక్టర్ గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. అభ్యుదయవాది, వీరశైవ మత స్థాపకుడు మహాత్మ బసవేశ్వరుని జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సమసమాజ స్థాపనకు పాటు పడిన వారిని స్మరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో ఒకరని, కుల, మత భేదాలు లేని సమాజ స్థాపనకే అవిరళ కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని తెలిపారు. మనుషులందరూ ఒక్కటే, కులాలు, ఉపకులాలు లేవన్న మహాత్మ బసవేశ్వరుని ఉపదేశాన్ని ప్రజలందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మ బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందని అలా నడవడమే, మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని ఆయన అన్నారు.

## ముస్లిం సమాజాభివృద్ధికి కృషి చేసిన ఏకైక సీఎం కేసీఆర్



హైదరాబాద్, మే 3:ముస్లిం సమాజాభివృద్ధికి కృషి చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యపేట జిల్లా కేంద్రంలోని ఈద్గాలో ముస్లింలు చేసిన సామూహిక ప్రార్థనల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. అల్లా దయతో ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండేలా కఠిన, ఉపవాస దీక్షలు చేయడం హర్షణీయం అన్నారు. అన్ని వర్గాల ఆచారాలు, సంప్రదాయాలు గౌరవించే విధంగా టీఆర్ఎస్ పాలన సాగుతుందన్నారు. క్రిస్మస్, రంజాన్,దసరా పండుగలు పేదల ఇండ్లలో సంతోషంగా జరగాలన్నది సీఎం కేసీఆర్ అభిమతమన్నారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శవంతంగా ఉందని మంత్రి జగదీష్ పేర్కొన్నారు.

## విద్యుత్ షాక్‌తో సంగారెడ్డిలో ఇద్దరు చిన్నారుల మృతి

హైదరాబాద్, మే 3:: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రంజాన్ వేళ విషాదకర సంఘటన చోటు చేసుకున్నది. శ్మశాన వాటికలో విద్యుద్ఘాతంతో ఇద్దరు బాలురు మృతి చెందారు. అయితే, ఇద్దరు బాలురు మూడు రోజుల కిందట అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలురు ఆచూకీ కోసం గాలిస్తున్న క్రమంలోనే ఇద్దరు మృతి చెందారు. మృతులను అబ్దుల్ అజీజ్ (11), ముల్తాని బాబు (16)గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొవిడ్ కొత్త వేరియంట్‌తో యమ డేంజర్.. మళ్లీ బంద్ పెట్టాలన్న బిల్‌గేట్స్

న్యూఢిల్లీ, మే 3:కొవిడ్ మహమ్మారి ముప్పు ఇంకా తొలగి పోలేదని బిలియనీర్ బిల్‌గేట్స్ హెచ్చరించారు. మరింత ప్రాణాంతకమైన, శరవేగంగా వ్యాపించే సామర్థ్యం గల కొవిడ్ వేరియంట్ దూసుకొస్తున్నదని పేర్కొన్నారు. దాని కట్టడికి అంతర్జాతీయంగా ఆంక్షలు పెంచాల్సిన అవసరం ఉందని మంగళవారం నొక్కి చెప్పారు. ఆ కొవిడ్ వేరియంట్ ఐదు శాతానికంటే ఎక్కువ ముప్పని పేర్కొన్నారు. పరిస్థితులు దుర్భరంగా ఉంటాయని చెప్పడం లేదన్నారు. కొవిడ్ మహమ్మారి వల్ల పుట్టుకొస్తున్న వేరియంట్ మరింత ప్రమాదకరమైందని, వేగంగా వ్యాపించగల సామర్థ్యం కలిగి ఉంటుందని వ్యాఖ్యానించారు. వైరస్‌ల వల్ల ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పు గురించి బిల్‌గేట్స్ హెచ్చరికలు జారీ చేయడం ఇది తొలిసారి కాదు.

2015లో తొలిసారి బహిరంగంగా ప్రపంచ దేశాలను బిల్‌గేట్స్ హెచ్చరించారు. యావత్ ప్రపంచం తదుపరి మహమ్మారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేదన్నారు. కొవిడ్ కేసులు తగ్గుముఖం పట్టడంతో పలు దేశాల్లో ఆంక్షల అమలును నిలిపివేశారన్నారు. తదుపరి మహమ్మారిని ఎలా ఎదుర్కోవాలన్న విషయమై బిల్‌గేట్స్ పుస్తకం రాశారు. ప్రపంచ ఆరోగ్య ముప్పును త్వరితగతిన గుర్తించడంతోపాటు ప్రపంచ దేశాల మధ్య సమన్వయానికి అంటు వ్యాధుల నిపుణులు, కంప్యూటర్ నిపుణులతో ఒక టీంను సృష్టించాలని సూచించారు. దీనికి 100 కోట్ల డాలర్లు ఖర్చవుతుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఈ నిధులను అందుబాటులోకి తేగలదని చెప్పారు.

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ప్రపంచ దేశాల అధినేతలు ఆరోగ్య సంక్షోభంపై హ్రస్వదృష్టి ప్రదర్శించొద్దని బిల్‌గేట్స్ హితవు చెప్పారు. భవిష్యత్ మహమ్మారులను నివారించడానికి భారీ పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కొవిడ్ మహమ్మారి నుంచి ఇంకా ముప్పు పొంచి ఉందని, ఇన్‌ఫెక్షన్ సోకకుండా దీర్ఘకాలం రోగ నిరోధక శక్తి గల వ్యాక్సిన్లను అత్యవసరంగా తేవాల్సి ఉందని వాదించారు.

## అప్పన్న నిజరూప దర్శనం సంతోషంగా ఉంది : గవర్నర్ తమిళిసై

అమరావతి, మే 3: విశాఖ జిల్లాలోని సింహాద్రి అప్పన్న ఆలయాన్ని తెలంగాణ గవర్నర్ తమిళిసై సందర్శించి అప్పన్న నిజరూప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కరోనా సమాజం నుంచి అంతమవ్వాలని స్వామివారిని కోరుకున్నానని ఆమె తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ఆమె ప్రశంసించారు. అప్పన్న నిజరూప దర్శనం సంతోషంగా ఉందని వివరించారు .

ఏపీ ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా స్వామివారికి తొలి చందనం సమర్పించారు. చందనోత్సవం సందర్భంగా సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యనారాయణ చెప్పారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, స్పీకర్ తమ్మినేని సీతారామ్ అప్పన్నను దర్శించుకున్నారు. అప్పన్న చం

## మండుటెండలతో జాగ్రత్త.. కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 3:దేశంలో చాలా చోట్ల ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. సాధారణం కంటే 6 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నట్లు సమాచారం అందుతోంది. అందువల్ల వేడి కారణంగా తలెత్తే అనారోగ్యాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వైద్య ఆరోగ్య శాఖ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఏప్రిల్‌లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వర్తమానం పంపింది. అందువల్ల ఉష్ణోగ్రతల కారణంగా ఎదురయ్యే అనారోగ్యాలకు సంబంధించిన జాతీయ కార్యాచరణ (నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ హీట్ రిలేటెడ్ ఇల్‌నెస్)లోని అంశాలపై ప్రచారం చేయాలి. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రాం (ఐడీఎస్‌పీ) కింద వేడి సంబంధ అనారోగ్యాలపై నిఘా ఉంచండి" అని అందులో పేర్కొన్నారు.

ఈ వేసవిలో సాధారణం కంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది.

## వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి మే 3:తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలోని ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

మంత్రి ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి మైనార్టీ సంక్షేమానికి పాటుపడుతున్నట్లు చెప్పారు. పండుగలను కలిసిమెలిసి జరుపుకొనే సంస్కృతి మన రాష్ట్రంలో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## చార్‌ధామ్ యాత్ర షురూ.. తెరుచుకున్న గంగోత్రి, యమునోత్రి ఆలయాలు

డెహ్రాడూన్, మే 3:: అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రి ధామ్ ఆలయాల తెరుచుకోగా.. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 6న కేదార్‌నాథ్, 8న బద్రీనాథ్ ఆలయాల తలుపులను భక్తుల కోసం తెలియనున్నట్లు సీఎం ప్రకటించారు. యాత్రను సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఈ సారి చార్‌ధామ్ యాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్నారు. యాత్ర నేపథ్యంలో వసతి, ఆరోగ్యం, విద్యుత్, నీటి ఏర్పాట్లు చేయడం ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. కరోనా మహమ్మారి తర్వాత రెండు సంవత్సరాల తర్వాత చార్‌ధామ్ యాత్ర పూర్తిస్థాయిలో ప్రారంభమవుతున్నది. అయితే, ఈ సారి చార్‌ధామ్ యాత్రపై భక్తుల్లో ఉత్కంఠ నెలకొంది. యాత్ర ఈ సారి చరిత్రాత్మకం అవుతుందని ప్రభుత్వం కూడా అంచనా వేస్తున్నది.

## ఈనెల 9న మన బస్తీ -మన బడి పనుల ప్రారంభం : మంత్రి తలసాని

హైదరాబాద్, మే 3:ఈనెల 9న హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో మన బస్తీ – మన బడి పనులు ప్రారంభమవుతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో మన బస్తీ ? మన బడి కార్యక్రమం అమలుపై హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి తలసాని సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ?ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,065 పాఠశాలలను గుర్తించి రూ.7,289.54 కోట్లను కేటాయించిందన్నారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల పరిధిలో 690 పాఠశాలలు ఉండగా, మొదటి విడతగా 239 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం గురించి పట్టించుకోలేదన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థుల కోసం నియోజకవర్గంకు ఒకటి చొప్పున ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉచిత కోచింగ్ లో ప్రతి అభ్యర్థికి నెలకు రూ.5 వేల చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు.

# సమాజంలో మార్పు వచ్చినప్పుడే కులవివక్షత రూపు మాసి పోతుంది..!

## –జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి .

సంగారెడ్డి,మే 3 (నేటి నిజం ప్రతినిధి) శ్రీ మహాత్మా బసవేశ్వరుని 889వ జయంతోత్సవం సందర్భంగా మంగళవారం జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ, ,అదనపు కలెక్టర్ రాజర్షి షా, వీరారెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, మాజీ శాసనసభ్యులు చింత ప్రభాకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు బైపాస్ రోడ్డు లో గల బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి,అదనపు కలెక్టర్ వీరారెడ్డి మహాత్మ బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు సమాజ మార్పుకు కృషి చేసిన మహనీయుడని,ప్రతి ఒక్కరూ ఆయన స్ఫూర్తితో వారి అడుగుజాడల్లో నడవాలన్నారు.

కులవివక్షత సమూలంగా పోయినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త యని, 12వ శతాబ్దంలోనే సమాజంలో ఎంతో మార్పు తీసుకు వచ్చారన్నారు. కుల, లింగ వివక్షత నిర్మూలనకు, ఆర్థిక సమానత్వానికి కృషిచేసిన మహనీయుడని కొనియాడారు.

కుల వివక్షత పూర్తిగా పోయిన నాడే మహనీయుల ఆదర్శాలు ఆశయాలు నెరవేరుతాయన్నారు. మంచి ఆలోచనలతో ముందుకు వెళ్తే నిర్మలమైన సమాజం ఏర్పడుతుందన్నారు. యువతకు, భావితరాలకు మహనీయుల గురించి తెలియజేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. యువత మనుషులంతా ఒక్కటే అన్న భావనతో ముందుకు వెళ్లాలని, సమ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారికంగా బసవేశ్వరుని జయంతిని నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలను, కులాలను, మతాలను సమానంగా చూస్తూ, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వారందరికి చేయూతనిచ్చి పైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు.

హిందూ ధర్మంలో పలు రకాల ఆలోచనలు, విధానాలు ఉంటాయని, 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు లింగాయత్ ఆలోచన ధర్మాన్ని అవలంబించారన్నారు. అనుభవ మండపంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

సమాజం ఒక ప్రవాహం లాంటిదని, అలాంటి సమాజం చక్కటి మార్గాల్లో నడవాలంటే బసవేశ్వరుని లాంటి ప్రవక్తలు కావాలన్నారు. వీర శైవ లింగాయత్ లు అంటే ఒక కులం కాదని, ఇది ఒక తత్వమని పేర్కొన్నారు. కాలక్రమేనా సమాజంలో విప్లవాత్మకమైన మార్పు మెల్లగా వస్తుందన్నారు. బసవేశ్వరుని జీవిత చరిత్ర, సమాజం కోసం పాటు పడిన ప్రతి మహనీయుని చరిత్ర భావితరాలకు తెలియాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

బసవేశ్వరుడు సమాజ మార్పుకు కృషిచేసిన మహనీయుడని, వారి ఆదర్శాలు ఆచరణీయమైనవన్నారు.

పలువురు ప్రజా సంఘాల నాయకులు, లింగాయత్ సమాజ ప్రతినిధులు ప్రసంగించారు. బసవేశ్వరుడు గొప్ప యుగపురుషుడని, విశ్వగురువని, మానవతావాది, సంఘ సంస్కర్త యని కొనియాడారు. సాటి మనుషులను గౌరవించి నప్పుడే నిజమైన మానవతావాదుల మౌతామని అన్నారు. బసవేశ్వరుడు సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. బసవేశ్వరుని రచనలను కింది స్థాయి వరకు తీసుకెళ్లే విధంగా వీరశైవ లింగాయత్ లు కృషిచేయాలని కోరారు. బసవేశ్వరుని అధ్యయనం చేస్తే కొంతమేరకైనా ఆయనను అనుసరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అదేవిధంగా సంగారెడ్డి బైపాస్ రోడ్ లోని బసవేశ్వర విగ్రహం గల రోడ్డు ను బసవేశ్వర మార్గ్/బసవేశ్వర చౌక్ అన్న పేరు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, కుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు,యువత, మహిళలు, వసతి గృహ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్ రామప్ప, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మధు శేఖర్, చంద్రశేఖర్ ,మేక మల్లేశం ,కూన వేణుగోపాల్ ,రమేష్ మల్లేశం ,అనంతయ్య, సిద్దేశ్వర్, మల్లికార్జున్, రామప్ప, వైద్యనాథ్, రాందాస్, నర్సింలు, ఇప్పలపల్లి నర్సింలు, మల్లయ్య, తోట చంద్రశేఖర్, శాంతికుమార్, మల్లికార్జున్ పాటిల్, బీరా యాదవ్, శ్రీనివాస్, కంది సర్పంచ్ విమల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ప్రారంభమైన నేషనల్ ఓపెన్ యాక్సెస్ రిజిస్ట్రీ (ఎన్ఓఏఆర్)

న్యూఢిల్లీ, మే 2: నేషనల్ ఓపెన్ ఆక్సెస్ రిజిస్ట్రీ ( అందరికీ అందుబాటులో ఉండే బహిరంగ రిజిస్ట్రీ – ఎన్ఓఏఆర్) 1 మే 2022 నుంచి పూర్తి స్థాయిలో విజయవంతంగా ప్రారంభమైంది. భాగస్వాములతో సహా ఉపయోగించే అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఎన్ఓఏఆర్ను సమగ్ర ఏకగవాక్ష ఎలక్ట్రానిక్ వేదికలా రూపకల్పన చేశారు.ముఖ్యంగా, వ్యాపారులు, విద్యుత్ ఎక్స్ఛేంజీలు, జాతీయ/ ప్రాంతీయ / రాష్ట్ర లోడ్ డిస్పాచ్ కేంద్రాల స్వల్ప కాలిక బహిరంగ ప్రవేశ అనువర్తన ల ఎలక్ట్రానిక్ ప్రక్రియలను రూపొందించడం ద్వారా అంతర్ రాష్ట్ర ప్రసార వ్యవస్థలో స్వల్పకాలిక అందరికీ అందుబాటులో ఉండే పరిపాలనను యాంత్రికం చేస్తుంది.

ఆర్ ఎల్డిసిలు లేదా ఎస్ఎల్డిసిలు, బహిరంగ ప్రవేశాన్ని కేటాయించిన ఓపెన్ ఆక్సెస్ వినియోగదారులు తదితరులు సహా అంతర్ రాష్ట్ర ప్రసారంలో ఎన్ఓఏఆర్ వేదిక సమాచార ఖజానాగా పని చేస్తూ, అటువంటి సమాచారం భాగస్వాములకు ఆన్లైన్లో అందుబాటులో ఉండేలా చూస్తుంది. చెల్లింపుల కోసం పేమెంట్ గేట్వేను అందించడమే కాక ఎన్ఓఏఆర్తో సమన్వయపరిచి, స్వల్పకాలిక ఓపెన్ ఆక్సెస్ బదలాయింపుల ఆర్థిక గణనలకు, ట్రాకింగ్కు సౌలభ్యాన్ని కల్పిస్తుంది.

పవర్ సిస్టం ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (పిఎస్ఒసిఎల్) ప్రారంభించిన నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్డిసి)ని ఎన్ఓఏఆర్ అమలు, నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా నియమించింది. వేగవంతమైన విద్యుత్ మార్కెట్లకు సౌలభ్యం కల్పించడంలో పునరావృత ఇంధన వనరులను గ్రిడ్లో సమన్వయపరచడంలో ఎన్ఓఏఆర్ కీలకంగా పని చేస్తుంది.

భారతదేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్లో దాదాపు 10% గా ఉన్న స్వల్పకాలిక విద్యుత్ మార్కెట్ సులభంగా, వేగవంతమైన అందుబాటుతో ఓపెన్ యాక్సెస్ వినియోగదారుడు సజావుగా మార్కెట్లో పాలుపంచుకునేందుకు ఎన్ఓఏఆర్ అవకాశం కల్పిస్తుంది.

ఎన్ఓఏఆర్ భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖలో భాగమైన చొరవ. దీనికి అవసరమైన నియంత్రణ చట్రాన్ని సిఇఆర్సి అంతర్ రాష్ట్ర ప్రసారాల ఓపెన్ యాక్సెస్ లోని 5వ సవరణ నిబంధనను కార్యాచరణలోకి తేవడం ద్వారా నోటిఫై చేసింది.

# ప్రసన్నాంజనేయ స్వామి అనుగ్రహం మనందరిపై ఉండాలి : మంత్రి హరీశ్ రావు

మెదక్, మే 3:ప్రసన్నాంజనేయ స్వామి అనుగ్రహం మనందరిపై ఉండాలని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని స్థానిక గణేష్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకి బిక్షా కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? ఆంజనేయ స్వామి అనుగ్రహంతో మనందరిపై ఉండాలని హనుమాన్ దీక్ష అత్యంత పవిత్రంగా, అకుంఠిత దీక్షతో ఎంతో నియమ నిష్టలతో స్వీకరిస్తారన్నారు. అకుంఠిత దీక్ష ఫలించాలని, వారి సంకల్పం సిద్ధించాలని స్వామిని ప్రార్థించారు. శ్రీరామ భవనంలో హనుమాన్ దీక్షా స్వాములకు ఏర్పాటు చేసిన బిక్షా కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అంతకు ముందు అలయ అర్చకులు మంత్రి హరీష్ రావు కు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అక్షయ తృతీయ సందర్భంగా గో పూజ నిర్వహించారు. బిక్షా కార్యక్రమం ప్రారంభించి స్వాములతో కలిసి మంత్రి బిక్షా చేశారు. అలాగే నర్సపూర్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ కల్యాణోత్సవం సందర్భంగా మంత్రి హరీష్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? అమ్మవారు దీవెనతో ఈ ప్రాంతమంతా కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలమైందని, రైతులు మోహం మొగులుకు పెట్టి చూసే రోజులు పోయాయని అన్నారు. కరువు పీడిత ప్రాంతం నుండి కల్పతరువుగా మారిందన్నారు. ఆ అమ్మవారి దయతో అన్నింటా మీకు మీ కుటుంబాలకు శుభం చేకూరాలని ఆకాంక్షించారు.



# వైద్య ఉపకరణాల తయారీలో ప్రపంచంలోనే తొలి సమీకృత కేంద్రంగా చెప్పదగిన విశాఖపట్నం మెడ్ టెక్ జోన్ (ఎ.ఎం.టి.జెడ్) ఆవరణలో "హెల్త్ క్లౌడ్" సదుపాయం

న్యూఢిల్లీ, మే 3:వైద్య ఉపకరణాల తయారీలో ప్రపంచంలోనే తొలి సమీకృత ఉత్పాదన కేంద్రంగా చెప్పదగిన విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్ (ఎ.ఎం.టి.జెడ్.) ఆవరణలో అధునాతన పరిజ్ఞానంతో కూడిన "హెల్త్ క్లౌడ్" సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారతీయ రైల్ టెల్ కార్పొరేషన్ ఈ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆరోగ్య రక్షణ రంగానికి సేవలందించే సమున్నత లక్ష్యంతో ఈ హెల్త్ క్లౌడ్ వ్యవస్థకు రైల్ టెల్ రూపకల్పన చేసింది. ఆరోగ్య రంగానికి ప్రత్యేకమైన, సిసలైన అవసరాలను తీర్చే "సమాచార కేంద్రం (డాటా సెంటర్)"గా ఇది పనిచేస్తుంది. రెయిల్ టెల్ కార్పొరేషన్, ఎ.ఎం.టి.జెడ్. మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందంలో భాగంగా ఇది ఏర్పాటైంది. అధునాతనమైన, డిజిటల్ పరిజ్ఞానంతో కూడిన ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్ అలయెన్స్ (ఇ.ఎం.ఆర్.ఎ.),రేడియాలజీ ఇమేజింగ్ సేవలు, హెల్త్ డిజిటల్ డాటా విశ్వసనీయ సేవలు వంటి సదుపాయాల రూపకల్పనే ధ్యేయంగా ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నారు.

వైద్య ఉపకరణాలు, వైద్యప్రక్రియ, ఆరోగ్య సేవలతో సంబంధం ఉన్నవివిధ రకాల ఐ.పి. వ్యవస్థలను, వినియోగ పద్ధతులను సమీకృతం చేయడానికి కూడా ఇది దోహదపడుతుంది.

ఈ భాగస్వామ్యం పరిధిలో చేపట్టే కార్యక్రమాలన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రులను అధునాతన డిజిటల్ ఆరోగ్య రక్షణా సదుపాయాలతో బలోపేతం చేస్తాయి. తద్వారా, అందరికీ ఆరోగ్య రక్షణ అందించాలన్న లక్ష్యాన్ని సాకారం చేయడానికి వీలవుతుంది.

కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒక మినీరత్న కంపెనీగా రైల్ టెల్ కార్పొరేషన్ పేరుగాంచింది. ప్రముఖ టెలికాం, ఐ.సి.టి. సేవల సరఫరా సంస్థగా రైల్ టెల్.కు పేరుప్రఖ్యాతలున్నాయి. తటస్థ టెలికాం మౌలిక సదుపాయ సేవలు అందించే భారీ సంస్థల్లో ఒకటిగా రైల్ టెల్ ఆవిర్భవించింది; ఇక ఎ.ఎం.టి.జెడ్. అనేది,. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఏర్పాటైన పారిశ్రామిక పార్కుగా పేరుగాంచింది. ఎలక్ట్రానిక్, విద్యుత్, ఎలెక్ట్రో మెడికల్, రేడియోలాజికల్, బయోమెటీరియల్ వైద్య పరికరాలను తయారు చేసే ఏకైక పారిశ్రామిక పార్కుగా ఎ.ఎం.టి.జెడ్. ప్రసిద్ధి చెందింది. దీనికి తోడు ఉమ్మడి వైజ్ఞానిక సదుపాయాలైన పరిశోధన, అభివృద్ధి సంస్థలు, ప్రయోగాత్మక పరిశోధనాగారాలు కూడా కలిగి ఉండటం ఎ.ఎం.టి.జెడ్. ప్రత్యేకత. విలక్షణమైన వైద్య ఉపకరణాలను తయారు చేసేందుకు అవసరమైన ప్రత్యేక సదుపాయాలు ఈ సంస్థలోనే ఉన్నాయి. అందుకే, సమీకృత వైద్య ఉపకరణాల తయారీకి ప్రపంచంలోనే తొలి సంస్థగా ఇది రూపుదాల్చింది. స్టార్టప్ కంపెనీలకు ఇంక్యుబేషన్ కేంద్రంగా కూడా ఇది సేవలందిస్తోంది.

ఎం.ఎం.టి.జెడ్. ఆవరణలోని రైల్ టెల్ "హెల్త్ క్లౌడ్" సదుపాయాన్ని జెనీవాకు చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు. హెచ్.ఒ.) ఆవిష్కరణ కేంద్రం సారథి లూయిస్ అంగర్బ్లాప్ ప్రారంభించారు. ఎ.ఎం.టి.జెడ్. మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి.ఇ.ఒ.) డాక్టర్ జితేంద్ర శర్మ, రైల్ టెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ.డి.) మనోహర్ రాజా, భారతీయ వైద్య ఉపకరణాల తయారీదార్ల సంఘం (ఎ.ఐ.ఎం.ఇ.డి.) ఫోరమ్ కోఆర్డినేటర్ రాజీవ్ నాథ్ తదితరుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది.

ఆరోగ్య సమాచారానికి సంబంధించిన గోప్యత, భద్రత, సార్వభౌమత్వ ప్రతిపత్తికి సంబంధించిన సమస్యలన్నింటినీ ఈ హెల్త్ క్లౌడ్ వ్యవస్థ పూర్తిగా పరిష్కరిస్తుంది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ పథకం (ఎ.బి.డి.ఎం.) వ్యవస్థకు అనుగుణంగా ఇది పనిచేతుంది.

సంచార కంటెయినర్ ఆసుపత్రికి సంబంధించి టెలికన్సల్టేషన్ పరిష్కారాలకు తగిన సాంకేతిక పరిజ్ఞాన మద్దతును రైల్ టెల్ సంస్థ అందించింది. ఈ మొబైల్ కంటెయినర్ ఆసుపత్రిని,. మారు మూల ప్రాంతాల్లో కూడా పనిచేయించగలిగే రీతిలో అవసరమైన సదుపాయాలతో ఎ.ఎం.టి.జెడ్. నిర్మించింది. చక్రాలపై నడిపిస్తూ ఈ పనిచేయించగలిగేలా ఈ ఆసుపత్రిని రూపొందించారు. మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ చెల్లింపు సదుపాయంతో మందులు అందించే హెల్త్ ఎ.టి.ఎం. సౌకర్యాన్ని కూడా ఇందులో కల్పించారు.

ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్ అలయెన్స్(ఇ.ఎం.ఆర్.ఎ.) క్లౌడ్, అనుసంధాన మద్దతను రైల్ టెల్ సంస్థ అందిస్తోంది. ప్రతి ఒక్కరినీ డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పరిధిలోకి తెచ్చే ఆసుపత్రి సమాచార వ్యవస్థ (హెచ్.ఐ.ఎస్.) అనే కన్సార్టియం ఏర్పాటుకు ఇది దోహదపడుతుంది.

హెల్త్ డిజిటల్ డాటా విశ్వసనీయ సేవలు, ఆరోగ్య సమాచారం వంటివి, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ పథకం వ్యవస్థకు అనుగుణంగా తయారు కావాలన్నదే ఈ కన్సార్టియం లక్ష్యం.

ఆరోగ్య రంగంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాల పరిధిలోకి కొన్ని ఉమ్మడి ప్రయోజనాలను చేర్చవచ్చు. వైద్య పరిజ్ఞాన వనరుల శోధన, వైద్య చికిత్స ఏర్పాటు, ఆరోగ్య రక్షణ నాణ్యతా పర్యవేక్షణ, అంటువ్యాధుల వ్యాప్తి పర్యవేక్షణ, మ్యాపింగ్, మందులు, వ్యాక్సిన్లు, వైద్య పరికరాలు, మెషీన్లు, అనుబంధ ఉపకరణాల సరఫరాపై పర్యవేక్షణ వంటివి ఈ ప్రయోజనాల కిందకే వస్తాయి.

రైల్ టెల్ సి.ఎం.డి. పునీత్ చావ్లా ప్రకటన.. "రైల్.టెల్ కు సంబంధించిన టెలికాం, ఐ.సి.టి. నైపుణ్యం, ఎ.ఎం.టి. జెడ్.లోని పటిష్టమైన ఆరోగ్య సామర్థ్యాలతో కలసినపుడు సామాన్య ప్రజలందరికీ అత్యున్నత స్థాయి సమాచార, సాంకేతిక పరిజ్ఞాన సేవలందించడానికి వీలవుతుంది. బలవత్తరమైన డిజిటల్ ఇండియా ఏర్పాటుకోసం స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాలను నిర్మించేందుకే ఉభయ సంస్థలూ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఆరోగ్య రంగాన్ని డిజిటల్ పరిజ్ఞానంతో పరివర్తన చెందించడంలో ఈ కొత్త కార్యక్రమం గొప్ప ముందడుగు అవుతుంది".

ఎ.ఎం.టి.జెడ్. సంస్థ ఎం.డి., సి.ఇ.ఒ. డాక్టర్ జితేంద్ర శర్మ ప్రకటన "ఆరోగ్య సమాచారం కోసమే ప్రత్యేకంగా ఒక సమాచార కేంద్రం ఏర్పాటుకు, విభిన్నవైన సేవలను సృష్టికి వీలు కలిగిస్తోంది. దీనితో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న ఆసుపత్రులను అధునాతనమైన డిజిటల్ ఆరోగ్య రక్షణ సామర్థ్యాలతో బలోపేతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. భారతదేశంలో వైద్య సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి సంబంధించిన సమాచార యోగ్యమైన కార్యక్రమాలకు సంబంధించి రైల్ టెల్ సంస్థతో భాగస్వామ్యం కుదరడం ఎ.ఎం.టి.జెడ్.కు ఎంతో సంతోషదాయకం. వైద్య సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధిలో, ఉత్పాదనలో భారతదేశం ప్రపంచ కేంద్రంగా రూపొందడానికి ఇది దోహదపడుతుంది."

రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని రైల్ టెల్ సంస్థ, "మినీ రత్న(కేటగిరీ–1)" గా పేర్కొనదగిన ప్రభుత్వ రంగ సంస్థ. తటస్థ టెలికాం మౌలిక సదుపాయాలను అందించే దేశంలోని భారీ సంస్థల్లో ఒకటిగా రైల్ టెల్ కార్పొరేషన్ పేరుగాంచింది. దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన ఆప్టిక్ ఫైబర్ నెట్ వర్క్ రైల్ టెల్ సంస్థకు ఉంది. 61,000కుపైగా ఆర్.కె.ఎం. ఆప్టిక్ ఫైబర్ తో కూడిన విశ్వసనీయమైన నెట్వర్కుతో పాటుగా, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గుర్తింపు కలిగిన టైర్ త్రీ డాటా కేంద్రాలు కూడా రైల్ టెల్ అధీనంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా భారీ స్థాయి నెట్వర్క్ సహాయంతో రైల్ టెల్ సంస్థ, వివిధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞాన సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది. భారత ప్రభుత్వంకోసం టెలికాం రంగంలో వివిధ రకాల పథకాలను, ప్రాజెక్టులను అమలుచేసేందుకు రైల్ టెల్ సంస్థను ఎంపిక చేశారు. వర్చువల్ ప్రైవేటు నెట్ వర్క్ కోసం మల్టీ ప్రొటోకాల్ లేబెల్ స్విచ్చింగ్ (ఎం.పి.ఎల్.ఎస్.–వి.పి.ఎన్.), టెలీ ప్రెజెన్స్, లీజ్డు లైన్, టవర్ కో లొకేషన్, డాటా సెంటర్ సేవలు వంటి అనేక రకాల సేవలను రైల్ టెల్ సంస్థ అందిస్తూ వస్తోంది. దేశంలోని రైల్వే స్టేషన్లలో పబ్లిక్ వై.ఫై సదుపాయాన్ని కల్పించడం ద్వారా రైల్వేస్టేషన్లను డిజిటల్ పరిజ్ఞాన కేంద్రాలుగా మార్చేందుకు కూడా రైల్ టెల్ సంస్థ కృషి చేస్తోంది. ఇప్పటికే 6,100కు పైగా రైల్వేస్టేషన్లలో రైల్ వైర్ ద్వారా వైఫై సదుపాయాన్ని రైల్ టెల్ సంస్థ కల్పించింది.

# బసవేశ్వరుని ఆశయాలు అందరికీ ఆదర్శనీయం - అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

హైదరాబాద్, మే 3:బసవేశ్వరుని ఆశయాలు మనందరికీ ఆదర్శనీయమని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. బసవేశ్వర జయంతి పురస్కరించుకొని కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు ఒక్కరని, ప్రజలంతా విశ్వగురువు అని పిలుస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు.

బసవేశ్వరుడు కుల వ్యవస్థ వర్ణ బేధం లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించారని అన్నారు. 12వ శతాబ్దంలో కర్ణాటక దేశాన్ని పాలించిన బిజ్జలుని కొలువు లో ఉద్యోగం చేరి, సామర్థ్యం నిజాయితీతో ప్రధాన మంత్రి పదవి అందుకున్నారని తెలిపారు. రాజ్య పాలనను ముఖ్య పాత్ర పోషిస్తూ వచ్చిన సాహిత్యంలో ప్రజలందరినీ కులమతాలకతీతంగా ఏకం చేశారని తెలిపారు. అలాంటి మహనీయుని జయంతి వేడుకలను ప్రభుత్వం



అధికారికంగా నిర్వహిస్తుందని, మహనీయుని బోధనలు ప్రజలంతా పాటించాలని మంచి మార్గంలో నడవాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో డి.సి.పి. రవీందర్, డి.ఆర్.డి. ఓ.శ్రీధర్, కలెక్టరేట్ సూపరెండెంట్ తూము రవీందర్, కలెక్టరేట్ సిబ్బంది,నంబంధిత అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బసవేశ్వరుడి జయంతి వేడుక.. వీరశైవ సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి

కరీంనగర్ , మే 3:(నేటినిజం ప్రతినిధి): సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ సుభాశ్ నగర్ 23వ డివిజన్ లోవీరశైవ మహాసభ ఆధ్వర్యంలో మహాత్మ శ్రీ బసవేశ్వర 889వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా మహాదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీర శైవ కులస్థుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీర శైవుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.



ప్రతి ఒక్కరు మహాత్మ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని మంత్రి గంగుల పిలుపునిచ్చారు. మనదేశంలో లాగా పాశ్చత్య దేశాలలో కులాలు కనిపించవని, అందుకే ఆ దేశాలు అభివృద్దిలో ముందుకు దూసుకుపోతున్నాయన్నారు. నాటి కాలంలోనే కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన బసవేశ్వరుని విగ్రహాన్ని నగరంలో ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తానన్నారు. అంతే కాకుండా 5 లక్షల రూపాయలతో వీరశైవులకు కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తామని హామి ఇచ్చారు.

# కుల ఆదాయ నేటివిటీ సర్టిఫికెట్లను యుద్ధ ప్రాతిపదికన అందించాలి..!

**–ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి.**
**–రైస్ మిల్లర్లు ధాన్యం వెంట వెంటనే దించుకునేలా చూడాలి.**
**–అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి రైతులను చైతన్యపరచాలి.**
**––రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు.**

సంగారెడ్డి, మే3 (నేటినిజం ప్రతినిధి) వివిధ ఉద్యోగాల నియామకాలకు నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో ఆదాయ, కుల, నేటివిటీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యుద్ధ ప్రాతిపదికన ఆయా సర్టిఫికెట్లను ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు తహసీల్దార్లకు ఆదేశించారు.

మంగళవారం సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ,అదనపు కలెక్టర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు ,తహసిల్దార్ లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా పోటీ పరీక్షల కోసం అవసరమైన సర్టిఫికెట్ల జారీ , ధాన్యం కొనుగోళ్లు, ధరణి, తదితర అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త ఉద్యోగ నియామకాలకై నోటిఫికేషన్లు వెలువడినందున, ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కుల, ఆదాయ, నేటివిటీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసిన వెంటనే ఏ రోజు కారోజు వెంటవెంటనే ఇవ్వాలని సూచించారు. దరఖాస్తు చేసిన 24 గంటల లోపు ఆయా సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు.

పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారి సమయం వృధా కాకుండా చూడాలని, విద్యార్థుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రావద్దని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఆయా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తహసీల్దార్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్ గా సందర్శించి పర్యవేక్షించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో మంచి గన్నీ బ్యాగులను, అవసరమైనన్ని టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రైతులను చైతన్య పరచాలని సూచించారు. రైస్ మిల్లర్స్ ఏ రోజు కారోజు ధాన్యం దింపుకొనే విధంగా గా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలని మంత్రి సూచించారు.

ధరణిలో కొత్త మ్యాడుల్స్ వచ్చాయని మంత్రి వెల్లడించారు. వాటి గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సర్వే నెంబర్ తప్పు, విస్తీర్ణంలో, భూమి రకాలలో తప్పులు ఉన్నట్లయితే మీ సేవలో ఆన్లైన్లో అప్లై చేయాలని తెలియజేయాలన్నారు. ధరణి సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంలో చొరవ చూపాలని సూచించారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు,అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# కష్టపడితే ప్రభుత్వ ఉద్యోగాలు : మంత్రి కొప్పుల



కరీంనగర్ , మే 3:(నేటినిజం ప్రతినిధి): నిరుద్యోగ యువతీ యువకులు కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగులుగా మారతారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో నిరుద్యోగ యువతీ యువకులకు ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? ప్రభుత్వం 81 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తుందని, నియోజకవర్గంలోని నిరుపేద యువతకు హైదరాబాద్ తరహా శిక్షణ ఉచితంగా అందిస్తున్నామన్నారు. శిక్షణ శిబిరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# విశ్వగురు బసవేశ్వరుడి మార్గంలో నడుద్దాం : మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, మే 3: సమాజంలోని కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయ వాది బసవేశ్వర స్వామి అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్రావు అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పొన్నాల వద్ద ఏర్పాటు చేసిన బసవేశ్వర స్వామి విగ్రహానికి మంత్రి హరీశ్ రావు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు ఒకరన్నారు. ఇతడిని బసవన్న, బసవుడు అని, విశ్వగురు అని పిలుస్తారు. లింగాయత ధర్మాన్ని స్థాపించిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అని మంత్రి తెలిపారు. సిద్దిపేట వచ్చే ప్రతి ఒక్కరూ బసవేశ్వరుడి ఆశీస్సులతో సిద్దిపేటకు వస్తారన్నారు. 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోసం కృషి చేయడంతో పాటు ఆచరణలో అమలు చేసిన మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు.

ప్రతి ఒక్కరూ కష్టపడి చేయాలని, కష్టపడి పని చేసిన వారే జీవితంలో పైకొస్తారని చెప్పిన ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పని చేద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ మీద సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదని మంత్రి తెలిపారు.

ఇటీవలే బసవేశ్వర స్వామి పేరు మీద బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ గా కొత్త ప్రాజెక్టు కట్టబోతున్నాం. కుల, మతాలు ఏవైనా భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్న దేశం మనదని, అందరూ కలిసి మెలసి ఉండాలన్న బసవేశ్వరుడి ఆశయాలను ఆచరణలో పాటిద్దామని మంత్రి పేర్కొన్నారు.

# ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

హైదరాబాద్, మే 3:రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలం పూడూరు, శామీర్పేట, కీసర, ఘట్కేసర్ మండలాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జడ్పీ చైర్మన్ శరత్చంద్రారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొదట ధాన్యం కొంటామని, ఆ తర్వాత కొనమని మాటమార్చి మోసం చేసిందన్నారు.

కేంద్రం మొండికేసినా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసేందుకు సీఎం కేసీఆర్ ముందుకు వచ్చారన్నారు.అందులో భాగంగానే మేడ్చల్, శామీర్పేట, కీసర, ఘట్కేసర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో పండించిన 16వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 11 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రైతులు, ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్లకు రాష్ట్రంలో నూకలు చెల్లినట్టేనని విమర్శించారు. సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి, జడ్పీటీసీలు శైలజావిజయేందర్ రెడ్డి, అనితాలాలయ్య, అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సుధాకర్ రెడ్డి, రణదీప్ రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయానందారెడ్డి, సర్పంచ్ బాబూయాదవ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు శేఖర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కీసర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ప్రభాకర్రెడ్డి ఫాంహౌజ్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సర్పంచ్ మాధురి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జె. సుధాకర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణ, టీఆర్ఎస్ నేతలు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, పర్వత్రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

శామీర్పేట మండల కేంద్రంలోని సొసైటీలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ మధుకర్రెడ్డి, డీఏవో మేరీరేఖ, ఎంపీపీ ఎల్లూబాయిబాబు, జడ్పీటీసీ అనితాలాలయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యయాదవ్, డైరెక్టర్లు , ఏవో రమేశ్, ఏఈవో రవి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సతీశ్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మోహన్రెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు అశోక్రెడ్డి పాల్గొన్నారు.

మండల పరిధిలోని మాదారం, ఎదులాబాద్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి మల్లారెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి ప్రారంభించారు. రైతుబంధు సమితి సభ్యుడు భిక్షపతి గౌడ్, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, కొండల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్లో భద్రత పెంచుతాం : ఏపీ హోం మంత్రి

అమరావతి, మే 3: రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఏపీ హోంమంత్రి వనిత తెలిపారు. మొన్న రాత్రి రేపల్లె రైల్వేస్టేషన్లో మహిళపై జరిగిన అత్యాచార ఘటనను ఖండించారు. మద్యం మత్తులోనే రేపల్లె నిందితులు అత్యాచారం చేశారని స్పష్టం చేశారు. బాధితురాలి భర్త వద్ద దొంగతనానికి నిందితులు యత్నించడంతో చోరీని అడ్డుకున్న మహిళపై అఘాయిత్యం చేశారని వివరించారు.మహిళల భద్రత దృష్ట్యా రైల్వేస్టేషన్లో భద్రత పెంచుతామని అన్నారు. రైల్వేస్టేషన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది కొరత వాస్తవమేనని అంగీకరించారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, ' గడప గడపకు వైఎస్ఆర్' వాయిదాలో రాజకీయ కోణం లేదని ఆమె తెలిపారు




## బీజేపీ మత విద్వేషాలకు బలి కావొద్దు : మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్, మే 3: హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి మత విద్వేషాలను రెచ్చగొట్టడం బీజేపీ ప్రధాన లక్ష్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూరు పట్టణంలో మంత్రి రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం దుబ్బ తండాలో దుర్గమ్మ గుడికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికార దాహంతో ప్రజలను మతాల పేరుతో విడదీసి చిచ్చుపెట్టి పరిపాలన సాగిస్తోందన్నారు.

దేశంలో దశాబ్దాలుగా కలిసిన ఉన్న విధంగానే హిందూ, ముస్లింలము అన్నదమ్ముల్లా కలిసి ఉందామని మంత్రి అన్నారు. మసీదు అభివృద్ధి కోసం 10 లక్షల రూపాయలతో పలు కార్యక్రమాలను చేపడతామని మంత్రి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముస్లిం సోదరులు, తండావాసులు,తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర స్వామికి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే నివాళి



రాజన్న సిరిసిల్ల, మే 3:(నేటినిజం ప్రతినిధి): మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా మంగళవారం బసవేశ్వర స్వామి చిత్రపటానికి రాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే పూల మాలలు వేసి నివాళర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బసవేశ్వర స్వామి సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని కొనియాడారు. లింగాయత ధర్మం స్థాపించారని, చిన్న వయసులోనే శైవ పురాణ గాథలను అవగతం చేసుకొని, రాజ్యపాలనలో ప్రధాన భూమిక నిర్వహిస్తూ వచన సాహిత్యంతో ప్రజలందరినీ కులమతాలకతీతంగా ఏకం చేసారన్నారు. బోధనలలోని సమదృష్టి ఎందరినో ఆకర్షించి, వీరశైవ మతానికి పట్టం కట్టిన బసవేశ్వర స్వామి ఖ్యాతి కర్ణాటక ఎల్లలు దాటి తెలుగు రాష్ట్రాలలో వ్యాప్తి చెందడం జరిగిందన్నారు.

## తగ్గనున్న ఎంఎంటీఎస్ ఛార్జీలు - ట్వీట్ చేసిన అధికారులు

న్యూఢిల్లీ, మే 3:హైదరాబాద్ ఎంఎంటీఎస్ ఛార్జీలను తగ్గిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఫస్ట్ క్లాస్ ఛార్జీలను 50 శాతం మేర తగ్గించారు. ఓటూ ఛార్జీలను మే 5 నుండి ఫస్ట్ క్లాస్ సింగిల్ జర్నీ ప్రయాణికులకు 50 శాతం వరకు తగ్గించనున్నారు. మే 5 నుంచి సబర్బన్ రైలు సర్వీసుల్లో ఫస్ట్ క్లాస్ బేసిక్ ఛార్జీలను తగ్గిస్తూ.. రైల్వే మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం.. సబ్-అర్బన్ సెక్షన్ల మీదుగా ఓటూ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు సింగిల్ జర్నీకి ఫస్ట్ క్లాస్ బేస్ ఛార్జీలు తగ్గించనున్నారు.

కోవిడ్ విధించిన లాక్‌డౌన్ తర్వాత సేవలను తిరిగి ప్రారంభించినప్పటి నుండి దక్షిణ మధ్య రైల్వే సబ్-అర్బన్ ప్రయాణీకుల ప్రయోజనం కోసం ఓటూ సేవల సంఖ్యను క్రమంగా పెంచుతోందని ౨అఖీ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం, ఫలక్‌నుమా-సికింద్రాబాద్- హైదరాబాద్- బేగంపేట్- లింగంపల్లి-తేలాపూర్-రామచంద్రపురం విభాగాల్లో 29 రైల్వే స్టేషన్‌లను కవర్ చేస్తూ 50 కిలోమీటర్ల మేర 86 సర్వీసులు నడపబడుతున్నాయి. ఓటూ సెక్షన్‌లోని వివిధ స్టేషన్‌లలో పీక్ అవర్ ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రయాణీకుల ప్రయాణ అవసరాలను తీర్చడానికి ఈ సేవలు ప్రణాళిక చేయబడ్డాయి. సబ్-అర్బన్ ప్రయాణీకులకు వేగవంతమైన . చౌకైన రవాణా మార్గాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రయాణీకులకు మరింత ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ ప్రయోజనాన్ని పొందాలని ప్రయాణీకులకు విజ్ఞప్తి చేస్తూ, ౨అఖీ జనరల్ మేనేజర్ (ఇన్-ఛార్జ్) అరుణ్ కుమార్ జైన్ వివరాలు వెల్లడించారు. ఎమ్ ఎమ్ టీఎస్ ఫస్ట్ క్లాస్‌లో తగ్గిన ఛార్జీలు మే 5 నుండి అమలులోకి వస్తాయని ట్వీట్ చేసింది.

## 5న నర్తకీమణులకు నాట్యప్రభ అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్, మే 3: వై.ఎస్.ఆర్. మూర్తి చారిటబుల్ ట్రస్ట్, వైజ్ మెన్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ సెంట్రల్, శ్రీ త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో మే 5వ తేదీ గురువారం సాయంత్రం ఆరు గంటలకు త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదకలో అంతర్జాతీయ నృత్యోత్సవ సందర్భంగా పలువురు నర్తకీ మణులకు ఉమెన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు లతో పాటుగా నృత్యరంగంలో మంచి పేరు గడించిన నర్తకీమణులకు నాట్య ప్రభ అవార్డులతో సత్కరించనున్నట్లు ట్రస్టు రథసారధి వైఎస్ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి ఆర్ట్ అకాడెమిలో శిక్షణ పొంది, కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ నర్తకిమణి నృత్య శిరోమణి బిరుదాంకితులు రేఖ సతీష్ (ఎం.ఏ.కూచిపూడి) తమ నృత్య ప్రదర్శనతో అలరింప చేయనున్నారనీ, హైదరాబాదుకు చెందిన సుప్రసిద్ధ నర్తకిమణి కూచిపూడి నృత్యంహలో ఎం.ఏ పట్టభద్రురాలు నాట్య రత్న రమణి సిద్ధి, డాక్టర్ వెంపటి చిన్న సత్యనారాయణ శిష్యురాలు 30 సంవత్సరాల అనుభవంతో తనదైన ప్రత్యేక శైలిలో నృత్యాన్ని కనువిందు చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

కూచిపూడి నృత్యంలో ఎం.ఏ పట్టభద్రురాలు సుప్రసిద్ధ నృత్య రారాణి రేణుక ప్రభాకర్ శిష్యురాలు సాయి లహరి సాంప్రదాయ రీతిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుందని మూర్తి వివరించారు. ఈ సందర్భంగా జరుగనున్న సభా కార్యక్రమానికి సుప్రసిద్ధ కూచిపూడి నాట్యచార్యులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ భాగవతుల సేతురాం ముఖ్య అతిధిగా నాట్య ప్రవీణ పి.రామదేవి నర్తకీమణులకు నాట్య ప్రభ బిరుదులను అందజేస్తారని ప్రముఖ నర్తకీమణి పద్మా కళ్యాణ్ ఆత్మీయ అతిధిగా, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి తదితరులు సభలో పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి తాను అధ్యక్షత వహించనున్నట్లు వై ఎస్ ఆర్ మూర్తి వెల్లడించారు.

## శ్రీవారి భక్తులకు గమనిక.. ఆర్జిత సేవలు రద్దు

తిరుపి, మే 3:: తిరుమల శ్రీవారి భక్తులకు గమనిక. పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా మే 10 నుండి 12వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు మే 10 నుండి 12వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడురోజులపాటు జరుగనున్న ఈ వేడుకలో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

# దేశంలో 25 శాతం టీవీల తయారీ హైదరాబాద్‌లోనే



హైదరాబాద్, మే 3: ప్రతి 14 సెకన్లకు ఒక టీవీ తయారు చేసే సామర్థ్యంతో ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ రేడియంట్ రాష్ట్రంలో తన రెండో యూనిట్‌ను ప్రారంభించింది. దీనితో దేశంలో 25 శాతం టెలివిజన్లు హైదరాబాద్‌లోనే తయారు కానున్నాయి. ఇప్పటివరకు ఉన్న యూనిట్ ద్వారా ఏడాదికి 21 లక్షల టెలివిజన్ల తయారీ సామర్థ్యం ఉన్న రేడియంట్ సంస్థ.. కొత్త యూనిట్ ప్రారంభించడం ద్వారా ఏడాదికి 45 లక్షల టీవీలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంచుకొన్నది. శ్యాంసంగ్, వన్‌ప్లస్, పానసోనిక్, అమెజాన్, స్కైవర్త్, నోకియా, మోటరోలా తదితర సంస్థల ఉత్పత్తులను రేడియంట్ తయారు చేస్తుంది. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలోని ఈ-సిటీలో రేడియంట్ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌ను విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే పదేండ్లలో దాదాపు 16 లక్షల మందికి ఉపాధి కల్పనతోపాటు.. ఏటా రూ. 2.5 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం లక్ష్యంగా పెట్టుకొన్నామని తెలిపారు. ఉత్పాదక సంస్థలు వాటి కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం తగిన సౌకర్యాల కల్పనకు సిద్ధంగా ఉన్నదని చెప్పారు. ఎలక్ట్రానిక్ సిటీలో ప్రస్తుతం 15 వేల మంది పనిచేస్తున్నారని.. వచ్చే ఏడాది నాటికి ఈ సంఖ్య 40 వేలకు చేరుకొంటుందన్నారు. 'రాష్ట్రం పరిశ్రమలకు,ఇతర వినియోగదారులకు 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా చేస్తున్నది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ముఖ్యమైంది నాణ్యమైన విద్యుత్తు సరఫరా. కరెంటు రాకపోతే ఉత్పత్తి లోపిస్తుంది. దీనివల్ల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది' అని మంత్రి కేటీఆర్ తెలిపారు.

### ఏటా 45 లక్షల టీవీల ఉత్పత్తి

ఉత్పాదక రంగాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. పెద్ద ఎత్తున పరిశ్రమల పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందని తెలిపారు. స్థిరమైన ప్రభుత్వం, సమర్థమైన నాయకత్వం ఉన్నందున ఇప్పటికే రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. ఉత్పాదక రంగాన్ని హైదరాబాద్ బయట ఇతర ప్రాంతాల్లో విస్తరించడానికి స్థలాల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో రేడియంట్ సంస్థ వివిధ బ్రాండ్లకు టెలివిజన్లు తయారు చేస్తున్నదని వెల్లడించారు. శ్యాంసంగ్, వన్‌ప్లస్, పానసోనిక్, అమెజాన్, స్కైవర్త్, నోకియా, మోటరోలా సంస్థల ఉత్పత్తులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రతి 14 సెకండ్లకు ఒక టీవీ తయారు చేస్తున్నదని తెలిపారు. దేశంలో 25 శాతం టెలివిజన్లు హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయని పేర్కొన్నారు.

ఇప్పటివరకు ఉన్న యూనిట్ ద్వారా ఏడాదికి 21 లక్షల టెలివిజన్ల తయారీ సామర్థ్యం ఉన్న రేడియంట్ సంస్థ.. కొత్త యూనిట్ ప్రారంభించడం ద్వారా ఏడాదికి 45 లక్షల టీవీలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంచుకొన్నదన్నారు. ఇప్పటివరకు కంపెనీ రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టిందని వివరించారు. రేడియంట్ తెలంగాణలో ప్రారంభించినప్పటినుంచి యాభై లక్షల టీవీలను తయారు చేయడం గర్వంగా ఉన్నదని తెలిపారు. ఇప్పటికే 2,800 మందికి ఉద్యోగాలు కల్పించిన ఈ సంస్థ అదనంగా మరో వెయ్యి మందికి ఉద్యోగాలిచ్చిందని.. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,800కు చేరిందని తెలిపారు. మరో 1,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. తెలంగాణలో అనుకూల వాతావరణం, శిక్షణ కలిగిన మానవవనరుల వల్ల తమ వ్యాపారం బాగా కొనసాగుతుందని.. 35 రెట్లు రెవెన్యూ పెరిగే అవకాశమున్నదని కంపెనీ యాజమాన్యం చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు.

### హైదరాబాద్ బయటా తయారీరంగం

రేడియంట్ అధిపతి మణికందన్ ఏడేండ్ల క్రితం తనను కలిసినప్పుడు మేడ్చల్‌లో ఒక యూనిట్ ఉన్నట్టు, ప్రభుత్వం సహకరిస్తే తాను ఒక పెద్ద టీవీల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తానని చెప్పిన విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తుచేసుకొన్నారు. మణికందన్ విజ్ఞప్తిమేరకు ఈ-సిటీలో స్థలం కేటాయించామన్నారు. తయారీ రంగాన్ని హైదరాబాద్ చుట్టూనే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించేందుకు భూముల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, కొత్తతరం వాళ్లు కంపెనీల ఏర్పాటునకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 180 కోట్ల పన్నులు రేడియంట్ సంస్థ ప్రభుత్వానికి చెల్లించిందని తెలిపారు. ఈ సందర్భంగా రేడియంట్ కంపెనీ తెలంగాణలో ఉత్పత్తి చేసిన 50వ లక్ష టెలివిజన్‌ను కేటీఆర్‌కు బహుమానంగా అందించింది.

ఐటీ, ఐటీఈ, ఎలక్ట్రానిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ చదువుకున్న యువకులకు మంచి అవకాశమున్నదని పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో ఇటీవలే 33 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద గూగుల్ క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. తెలంగాణలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ తదితర అన్ని రంగాలతో కూడిన బహుముఖ అభివృద్ధితో దూసుకుపోతున్నామని తెలిపారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రేడియంట్ కంపెనీలో 60 శాతం మంది స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు ఇస్తుండటంపై సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, రేడియంట్ కంపెనీ డైరెక్టర్ మణికందన్, ఎండీ రమీందర్ సింగ్, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగ రంజాన్ వేడుకలు

### ఈద్గాలలో మసీదుల వద్ద మత గురువుల ప్రార్థనలు



రాజన్న సిరిసిల్ల, మే 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మంగళవారం నాడు రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్థనలు ఈద్గా మైదానాలలో ప్రార్థనలు చేసుకుని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లాలోని వేములవాడ, చందుర్తి రుద్రంగి కోనరావుపేట ఎల్లారెడ్డిపేట ఇల్లంతకుంట , పట్టణాలతో పాటు దాదాపు అన్ని మండలాల్లో ఈదుల్ ఫితర్ రంజాన్ వేడుకలు మంగళవారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు.ఒకరినొకరు ఆత్మీయంగా ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేస్తుకున్నారు.వేములవాడ పట్టణ జామా మజీద్ మత గురువు మౌల్వీ మహమ్మద్ ప్రవక్త బోధనల సారాన్ని రంజాన్ మాసం ప్రత్యేకతను ,ఈదుల్ ఫితర్ పండుగ సందేశాన్ని చదివి వినిపించారు .6 తబ్బీర్ లతో ఈద్ నమాజ్ చదివించి ,అనంతరం కుత్బా చదివినవారు .ఈ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలు బిర్యాని వంటలు, తీపి పదార్థాలు తీసుకొని బంధుమిత్రులకు పంచుకున్నారు. ముస్లిం సోదరులు వేరే ప్రాంతాల్లో ఉన్న బంధువులకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ తమ సన్నిహిత కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఇకపోతే రంజాన్ సందర్భంగా జిల్లాలోని వివిధ హోదాలో ఉన్న పలువురు ముస్లిం మైనారిటీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, మత పెద్దలకు సన్నిహితులైన మిత్రులు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.శ్రీ . ఎమ్మెల్యే రమేశ్ బాబు , జెడ్పీచైర్ న్యాల కొండ అరుణ రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు , మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ , టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు జిల్లాలోని ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న రంజాన్ వేడుకలతో ముస్లిం కుటుంబాల్లో సుఖ సంతోషాలు నిత్యం నెలవుడాలని ఆకాంక్షించి వారికి నేడు జరుపుకుంటున్న రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు..రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అల్లా దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని, దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ముగింపు వేడుక అని పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉండటం, ఐకమత్యంతో మెలగటం, పేదలకు తోడ్పడటం ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని, మనిషిలోని చెడు భావనలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని పేర్కొన్నారు.

## త్వరలోనే ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఆ సేవలు : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, మే 3:: గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్‌కే పరిమితమైనా మోకాలి చిప్పలు మార్పిడి చికిత్సను త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఇటీవల మోకాళ్ల చిప్పల ఆపరేషన్లు చేయించుకున్న పేషెంట్లను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం ఇద్దరికి సిద్దిపేట దవాఖానలో మోకాలి చిప్పలు మార్పిడి ఆపరేషన్ చేస్తాం. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని మంత్రి సూచించారు. డబ్బులు ఉన్నవాళ్లు మాత్రమే చేసుకునే మోకాలి చిప్పల మార్పిడి నేడు ప్రభుత్వ దవాఖానల్లో పేద వాళ్లకు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

సీఎం కేసీఆర్ కన్న కలలు నేడు నిజమవుతున్నాయని మంత్రి తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ దవాఖానల్లో 30 శాతం ప్రసవాలు అయితే నేడు 56 శాతం అవుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్లనే మోకాలు చిప్పల సర్జరీలు సాధ్యం అవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సర్జరీలకు సుమారు రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగానే ఈ సేవలు పొందవచ్చుని మంత్రి తెలిపారు.

## దరఖాస్తు చేసుకున్న 24గంటల్లోనే ధృవపత్రాలు అందించాలి : హరీశ్ రావు

సంగారెడ్డి,మే 3: సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో నిరుద్యోగులు ధరఖాస్తు చేసుకొనే ఆదాయ, నివాస, కుల ధృవ పత్రాలను 24 గంటల్లోనే ఇవ్వాలని మంత్రి హరీష్ రావు అధికారులను ఆదేశించారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు, తహశీల్దార్ లతో మంత్రి హరీష్ రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగులు ఆదాయ, కుల, నివాస ధృవ పత్రాలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆలస్యం అవడంతో పై చదువులకు, ఉద్యోగ ధరఖాస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందని, అలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తు చేసుకున్న 24గంటల్లోనే చేతికి అందాలని అధికారులను ఆదేశించారు. వారి సమయం వృధా కాకుండా ఏరోజుకు ఆరోజు పత్రాలు వచ్చే విధంగా చూడాలని చెప్పారు. మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా మీ సేవ కేంద్రాల ఏర్పాటు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఉద్యోగం కోసం అప్లై చేసే వారికి అన్నివిధాలా బాసటగా నిలవాలని చెప్పారు. ఇందుకు ఆర్డీవో లు, తహశీల్దార్ లు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.

జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లర్స్ తో సమన్వయం చేస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి తెలిపారు. గన్ని బ్యాగ్స్ డ్యామెజ్ లేకుండా ఇవ్వాలని, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా టార్పలిన్ కవర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్ లు అన్ని కొనుగోలు కేంద్రాలు సందర్శించి పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు.

## కాసేపట్లో విద్యుదుత్పత్తి ప్రారంభం : ఎన్టీపీసీ

అమరావతి, మే 3: గ్రిడ్ వైఫల్యంపై సింహాద్రి ఎన్టీపీసీ వివరణ ఇచ్చింది. భారీ గాలులు, వర్షం వల్ల 2 సబ్‌స్టేషన్లు ట్రిప్ అయ్యాయని ఎన్టీపీసీ తెలిపింది. కలపాక, గాజువాక సబ్‌స్టేషన్లు ట్రిప్ అయినట్లు పేర్కొంది. ఎన్టీపీసీలో ఉత్పత్తయ్యే విద్యుత్ 2 సబ్‌స్టేషన్ల నుంచి గ్రిడ్‌కు వెళ్లాల్సి ఉందని, 2 సబ్‌స్టేషన్లు ట్రిప్ కావడంతో సింహాద్రిలోని 4 యూనిట్లు ట్రిప్ అయ్యాయని వివరించింది. దీనివల్ల 2 వేల మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని వెల్లడించింది.

నేషనల్ గ్రిడ్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు స్పష్టం చేసింది. 1, 4 యూనిట్లు విద్యుదుత్పత్తికి సిద్ధమైనట్లు తెలిపింది. కాసేపట్లో విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుందని పేర్కొంది. 2, 3 యూనిట్లలో మరమ్మతులు చివరి దశలో ఉన్నాయని ప్రకటించింది. సాయంత్రంలోపు అన్ని యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమవతుందని స్పష్టం చేసింది.దక్షిణాది గ్రిడ్‌లో లోపం వల్ల విశాఖలోని సింహాద్రి, హిందూజా ఎన్టీపీసీ ప్లాంట్లలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో సాంకేతికలోపం తలెత్తడంతో విద్యుతుత్పత్తి నిలిచి పరిసరప్రాంతాలు అంధకారంగా మారాయి. గ్రిడ్?కి విద్యుత్ ప్రసార లైన్లలో ఏర్పడిన సమస్య వల్ల అకస్మాత్తుగా ప్లాంట్లలోని విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. అత్యవసర ప్రాతిపదికన విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ పనులు చేపట్టారు.దాదాపు రెండు గంటల తర్వాత గ్రిడ్ నుంచి విద్యుత్ సరఫరా తిరిగి ఆరంభం కావడంతో సింహాద్రిలో మళ్లీ విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు. హిందూజా లోనూ విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి.

## బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు బెజ్జంకి శ్రీకాంత్ కు ఘన సన్మానం



రాజన్న సిరిసిల్ల, మే 3:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా ఘన విజయం సాదించిన బెజ్జంకి శ్రీకాంత్ ను వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నర్సింగ నరింగ రావు, ప్రెస్ క్లబ్ అధక్ష్యులు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ కొల్లూరి శ్రీనివాస్ గుప్తాలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బెజ్జంకి శ్రీకాంత్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణిస్తూ, పేద ప్రజలకి ఉచితంగా న్యాయ సహాయం చేస్తుండడం అభినందనీయమని అన్నారు.

## ముస్లిం సోదరులకు ప్రజాప్రతినిధులు, అధికారుల శుభాకాంక్షలు



రాజన్న సిరిసిల్ల, మే 3:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోమంగళవారం రంజాన్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్ద అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా ఈ వేడుకలకు వేములవాడ మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్, సెస్ డైరక్టర్ పొలాస నరేందర్, కౌన్సిలర్లు సిరిగిరి చందు , నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, టీఆర్ఎస్ నాయకులు పుల్కం రాజు,మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజులు హాజరై, ముస్లిం సోదరులకు ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రంజాన్ మాసం మున్సిపల్ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేసినందుకు మున్సిపల్ కమిషనర్ ,మున్సిపల్ చైర్ పర్సన్ ను పాలక వర్గాన్ని ముస్లిం సోదరులు ఘనంగాసత్కరించానారు.రంజాన్ మాసంలో పండుగ సందర్భంగా ఈ ఏర్పాట్లు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు .సన్మానించిన వారిలో ముస్లిం పట్టణ అధ్యక్షుడు అక్రమ్ , కొఆప్షన్ సభ్యులు సర్వర్ అలీ బాబు న్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్ ,సీనియర్ జర్నలిస్టు ,జిల్లా స్పోర్ట్స్ కరాటే ప్రధాన కార్యదర్శి ఏం ఏమన్నాన్ జర్నలిస్టులు తాహెర్ పాషా మహ్మద్ కలీం పాషా ఖాజా నయిమొద్దీన్ , మదీనా జామా మజీద్ అధ్యక్షులు రజాక్ ,రఫిక్,మాజీ కోఆప్షన్ సభ్యులు అమానుల్లా ఖాన్ టీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఇబ్రహీం, ముస్లిం కమిటీ యూత్ నాయకులు షేక్ ఇంతియాజ్ ఇలియాస్ ఉన్నారు


ఆహ్వానం

గోల్కొండ సాహితీ కళా సమితి

ఆధ్వర్యంలో



'తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకులు'

సురవరం ప్రతాపరెడ్డి గారి 126వ జయంతి

సందర్భంగా

కవితలకు ఆహ్వానం

అంశం : 'సురవరం మన వరం' - సురవరం జీవితం, సాహిత్యం, సామాజిక సేవ

(కవిత, పద్యం, పాట మొదలైన కవితా ప్రక్రియలలో)

కవితలు 16 పంక్తులు మించకుండా, పద్యాలు 4 పద్యాలు మించకుండా ఉండాలి

ఈ కార్యక్రమం 2022 మే నెల చివరి వారంలో ఉంటుంది.

కవితలను పంపాల్సిన చివరి తేది : 10-05-2022

కవితలు పంపాల్సిన వాట్సాప్ నెం : 95027 07093

గమనిక : పుస్తక ఆవిష్కరణ, కవిసమ్మేళనం తేదిని మీకు త్వరలోనే తెలియజేస్తాము.

ఇట్లు

గంట మనోహర్ రెడ్డి, గోల్కొండ సాహితీ కళాసమితి ఉపాధ్యక్షులు

డా. చంద్రప్రకాశ్ రెడ్డి, గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.